


# గుండ్లపల్లి రవిశంకర్



## 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

మా స్వగ్రామం ప్రకాశం జిల్లాలోని వైదన. మా నాన్నగారు 1956 లోనే వైదన వదిలి వృత్తి కారణంగా విజయవాడలో స్థిరపడ్డారు కాబట్టి నా స్వనగరం విజయవాడ అయింది. మొదట వాణి బాల విద్యాలయం, తరువాత అన్నా థామస్, తరువాత ఎన్. ఎస్. ఎం. పబ్లిక్ స్కూల్లో చదువుకున్నాను. మా అన్నయ్యలు, అక్కయ్యలు తెలుగు మీడియంలో చదుకున్నారు కాబట్టి నేను ఇంగ్లీషు మీడియంలో చదవాలని మా మేనత్త మంగమ్మ ప్రోత్సహించగా అన్నా థామస్ స్కూల్లో చేరాను. అక్కడ మొదలయింది ఆంగ్ల భాషలో నా విద్యా శిక్షణ. కానీ, మనసులో మాత్రం తెలుగన్నా, తెలుగు పాటలన్నా తెలుగు సినిమాలన్నా మక్కువ వుండేది.




అందరికీ చిన్నతనంలో భక్తి శ్రద్ధలు, వినయము, మంచి అలవాట్లు నేర్పే గురువులు అమ్మ నాన్నలు. వారి తరువాతే ఏ టీచరైనా, మాష్టారైనా, మిస్సైనా. అన్నాథామస్‌లో పద్మా మిస్, ఎన్. ఎస్. ఎం. లో జాన్ డేవిడ్ సార్ (లెక్కలు), ఎం. వి. ఎస్. ప్రసాద్ (ఫిజిక్స్), చావలి సత్యన్నారాయణ(కెమిస్ట్రీ), రంజని మిస్ (సోషల్), సిల్వీ (ఇంగ్లీషు), బ్రదర్ బర్క్‌మెన్స్ (పొయెట్రీ), వెంకటరెడ్డి(తెలుగు), ప్రభాకర రావు (స్కౌట్), చంద్రశేఖర్ (బయోలజీ), జోజయ్య (ఆటలు) - వీళ్ళందరూ ప్రవృత్తులే. నేను ఎన్. ఎస్. ఎం. లో చేరినప్పుడు వీళ్ళందరూ కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారు. ఎంతో ఉత్సాహంతో, మా విద్యార్థులపట్ల ప్రీతితో, ఓర్పుతో, పాఠాలు చెప్పేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే, వీళ్ళందరూ "మా మంచి మాష్టారులే", చక్కగా చదువు చెప్పినవారే, బాధ్యత నేర్పినవారే, విద్యా దానం చేసినవారే.

"మెరిసే తారలదే రూపం" అని సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారికి ప్రశ్న వచ్చినట్లు, నాకిప్పుడు ఇంతమంది మాష్టారుల్లో "మంచి మాష్టారెవరబ్బా" అన్న ప్రశ్న వచ్చింది. అందరి మాష్టార్ల గురించీ వ్రాయాలంటే సమయము, ఈ పత్రికలో స్థలము, పాఠకులలో ఓర్పు సరిపోదు కనుక ఒక్కరి గురించి వ్రాస్తాను. ఆయన గురించి వ్రాసేముందు నాకు నచ్చిన ఓ మంచి తెలుగు పద్యం. ఇది నేను వ్రాసింది కాదు. శతావధాని శ్రీ రాళ్ళబండి కవితా ప్రసాద్ గారు రచించి, పద్యార్థినయిన నాకు స్వయంగా నేర్పినది.

వాణీ కరాంచిత వల్లకీ క్వణనంబు తెలుగు నాదము విని అలుక బూనే,
వాణీ కరాంచిత భవ్యాక్ష మాలయే తెలుగు వర్ణద్యుతికి పలకబారే,
వాణీ కరాంచిత ప్రాబల్య గ్రంధమే తెలుగు కావ్య శ్రేణి తలచు కొనియే,

వాణీ కరాంచిత వర కింకిణీ ధ్వనుల్ తెలుగు పద్య ధ్వనికి నిలచిపోయే.
వాణి పదపంకజంబుల వర్తుల గతి తెలుగు పదముల తుమ్మెదల్ కలసి మూగ కాలు సేతులునాడక కలవరపడే భారతీదేవి కనుమా....

ఈ పద్యం సరస్వతీ అమ్మవారు తెలుగు భాషలోని మధురత్వము చేత తన్మయత్వంతో స్తంభించిపోయిన పరిస్థితిని వివరిస్తూ వ్రాసినది. తెలుగు పదాలు వినగానే అమ్మవారి వీణ పలకడం మానేసిందట. తెలుగు అక్షరాలు చూడగానే అమ్మవారి అక్షరమాల పలకబారిపోయిందట. తెలుగు కావ్యాలను వినగానే అమ్మవారి చేతిలోని గ్రంథాలు "అబ్బా! ఎంత బావున్నాయో" అని తలుచుకున్నాయట. తెలుగు పద్యాలను వినగానే అమ్మవారి గాజుల సవ్వడి ఆగి పోయిందట. తెలుగు పదాలు తుమ్మెదల్లాగా అమ్మవారి పాదాలను చుట్టుముట్టగా ఆవిడ కాలి గజ్జెలు ఆగి పోయాయట.

అంత గొప్పైన, మధురమైన, మహోన్నతమైన, లెప్పైన తెలుగు భాష పట్ల ఆసక్తిని, శ్రద్ధని చిన్నతనంలోనే కలిగించినవారు, చూడగానే నటుడు మురళీ మోహన్ లాగా ఉంటారు మా రెడ్డి సార్. పూర్తి పేరు ఎర్రబోతుల వెంకటేశ్వర రెడ్డి. 1953లో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు లో జన్మించారు. తాడికొండ లోని గోగినేని కనకయ్య కాలేజీలో భాషాప్రవీణ పూర్తిచేసి, తరువాత ఆంధ్రా విశ్వవిద్యాలంలో ఎం. ఏ 1976 లో పూర్తి చేసారు. 1978 నుంచి ఈ నాటి వరకు మా ఎన్. ఎస్. ఎం. పబ్లిక్ స్కూల్లో తెలుగు మాష్టారుగా పనిచేస్తున్నారు. విశేషం ఏమిటంటే నేను కూడా అదే సంవత్సరంలో ఎన్. ఎస్. ఎం. లో చేరాను. అప్పటినుంచీ తెలుసు నాకు మా రెడ్డి సార్.

సంస్కృతాంధ్ర భాషల్లో అనర్గళంగా పద్యాలను పాడేవారు, తెలుగు పదాలను ముత్యాల్లాగా బోర్డుమీద వ్రాసేవారు. పాడిన పద్యాలన్నింటికీ ప్రతి పదార్థములు క్షుణ్ణంగా, వివరంగా చెప్పేవారు. వీరేశలింగంగారి జీవిత చరిత్ర లాంటివి ఎంతో సంఘ పరిరక్షణోద్రేకతతో చెప్పేవారు.

"అలినీలాలకంబూర్ణ చంద్ర ముఖి" లాంటి పద్యాలను ఎంతో శృంగార రసంతో వివరించేవారు. వేమన శతకాలను చక్కటి ఉదాహరణలతో విశదీకరించేవారు. చిన్నయ సూరి గారి ప్రస్తావన వచ్చినప్పుడు "మానవుడు తలిస్తే సాధించలేనిది లేదు" అంటూ ప్రోత్సహించేవారు. ఇలా తెలుగు భాషకి సంబంధించిన ఏ పాఠమైనా పిల్లలం మాకు అందేటట్లు, అర్థమయ్యేటట్లు చెప్పేవారు. ఒకసారి రుక్మిణిని వివరిస్తున్న పద్యం వచ్చింది. రుక్మిణి యొక్క అంగ సౌందర్యాన్ని వర్ణిస్తూ వ్రాసిన పద్యమది. అప్పుడు మా రెడ్డి సార్ రంగురంగుల చాక్ పీసులు తీసుకొని బొమ్మ గీయడం మొదలు పెట్టారు. లేడి కళ్ళలాంటి కళ్ళు, కొంగ మెడ, దొండ పళ్ళులా పెదాలు, తామరకాడల్లా కాళ్ళు, ఏనుగు కుంభస్థలంలాగా స్తనములు, సింహమధ్యంలాగా నడుము....ఇలా గీసేటప్పటికీ ఓ అసహ్యకరమైన, వికృతమైన, చమత్కారమైన మనిషి తయారయింది. "ఇదేరా రుక్మిణి! ఎవరైనా చేసుకుంటారారా పెళ్ళి?" అని ప్రశ్నించారు. విద్యార్థినులందరూ సిగ్గుపడ్డారు, కుర్ర కారం మేమంతా పరమానందంతో చప్పట్లు కొట్టాము (తొమ్మిదో క్లాసులో పెళ్ళి ప్రస్తావనా ....అని). ఇంకోసారి ఓ అమ్మాయి "విద్యాలయము" అని వ్రాయబోయి "విధ్యాలయము" అని వ్రాసింది. "ఒసేయి, విధ్య అంటే వధ - అంటే చంపటం అనే అర్థం వస్తుందే నిజమే, ఇలా వ్రాసి ఈ విద్యాలయంలో నన్ను చంపుతున్నావు" అని హాస్యంగా మందలించారు. ఇలాంటి మధురమైన జ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి.

ఎండా కాలం సెలవల్లో విజయవాడ వెళ్ళినప్పుడు మా ఎన్. ఎస్. ఎం స్కూల్లో టీచర్లందరితో పాటు, మా రెడ్డి సార్ని కూడా కలుస్తూ వుంటాను. పదో తరగతి ప్యాసయి 22 సంవత్సరాలు అయినా ఇప్పటికీ, "ఏరా రవిశంకర్, బావున్నావా" అని ఎంతో ఆప్యాయతతో పలకరిస్తారు. మొన్న వెళ్ళినప్పుడు చెప్పాను, ఈ మధ్య పద్యనాటకాలు వేసానని, అర్జునుడు, తెనాలి రామకృష్ణుడి పాత్రలు వేసానని. ఎంతో ఆశ్చర్యానందంతో, ఏది ఓ పద్యం పాడు విందాము అన్నారు. నాకు చాలా ఇష్టమైన "అరవిందాక్షుడు శేషసాయి" పద్యం పాడి వినిపించాను. దానికి -

ఆయన ఎంతో సంతోషించి "ఒరేయి, అసలు నువ్వు అమెరికాలో ఉన్నావా, అమలాపురంలో ఉన్నావా" అంటూ మెచ్చుకున్నారు. ఈ కౌముది శీర్షిక ద్వారా మా మంచి తెలుగు మాష్టారు గురించి వ్రాసే అవకాశం దొరికినందుకు చాలా ఆనందంగా ఉంది.

ఎందరో మహానుభావులు, అందరికీ వందనములు. ఎందరో గొప్ప మాష్టారులు, అందరిలో ప్రముఖమయిన, ప్రకాశవంతమయిన, మెరిసే మా 'స్టార్' మా వెంకటేశ్వర రెడ్డి సార్. వారికి వారి కుటుంబానికి బగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని, ఆయన ఇంకా ఎంతో మంది పిల్లల్ని విద్యావంతులను చేయాలని కోరుకుంటున్నాను. ఎంతో ఓర్పుతో ఇంతవరకు చదివిన మీ అందరికీ, ఈ అవకాశం ఇచ్చిన కౌముది వర్గానికి నా ధన్యవాదములు.



*డాక్టర్ గుండ్లపల్లి రవిశంకర్‌గారు మద్రాసు ఐ.ఐ.టి తరువాత యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్ నుంచి డాక్టరేట్ పట్టా సంపాయించి గత 16 సంవత్సరాలుగా అమెరికాలో ఉంటున్నారు. ప్రస్తుతం శాన్‌హోసెలో టర్నింగ్ పాయింట్ ఎకాడెమీ అనే విద్యాబోధన సంస్థని స్థాపించి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. తెలుగు భాష పట్ల మమకారం మెండు. ముఖ్యంగా పద్యాలంటే చాలా ఆసక్తి. 'ఇంద్ర సభ' , 'శ్రీకృష్ణరాయబారం' లాంటి పద్య నాటకాల్లో ప్రముఖ పాత్రలు పోషించారు. భార్య వాణి, కుమార్తె నిత్యలతో శాన్ హోసెలో నివాసం.*

*మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అన్నారు పెద్దలు. 'గురు సాక్షాత్పరబ్రహ్మ' అనికూడా మనకి తెలుసు. చిన్నప్పటినుంచీ మన వ్యక్తిత్వం రూపు దిద్దుకోవడంలో అమ్మా, నాన్నల పాత్ర ఎంతవుంటుందో, మనకి విద్యా బుద్ధులు నేర్పించే మాష్టారి పాత్ర కూడా అంత వుంటుంది. చదువు నేర్పేటప్పుడు ఒక్కోసారి కఠినంగా వున్నా, మన జీవితంలో మాస్టారు ఎప్పుడు ఎదురైనా నమస్కరించకుండా వుండలేం. అలా..మీ జీవితంలో మిమ్మల్ని ఎక్కువగా ప్రభావితం చేసిన మాస్టారు ఎవరు, వారంటే ఎందుకిష్టం, వారి నుంచీ మీరు నేర్చుకున్న జీవిత పాఠాలేమిటి .. 'కౌముది' పాఠకులతో పంచుకోండి. మీ మంచి మాష్టారి గురించి 2-3 పేజీలు వ్రాసి పంపండి. వీలైతే ఫోటోలు కూడా పంపిస్తే ఈ శీర్షికలో ప్రచురిస్తాం.*

***మీ రచనలు పంపాల్సిన చిరునామా:***

*Editor*

*KOUMUDI (Web Monthly)*

*4251 Escudo Ct*

*Dublin, CA 94568*

***Email: editor@koumudi.net***